క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మద్దిపాడు: కొలచనకోటలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 ట్రాక్టర్లను ఎస్ఐ శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం కొలచనకోట - వెల్లంపల్లి మధ్యో సీజ్ చేశారు. మండల రెవెన్యూ అధికారి రజనీ ఫిర్యాదు సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఇసుక అక్రమ రవాణ అనధికారికంగా జరుగుతున్నట్లు ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి 9 ట్రాక్టర్ లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

16న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

చీమకుర్తి: మండల కేంద్రం చీమకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ పదవికి అర్హత కలిగిన అభ్యర్థిని ఈనెల 16న ఎన్నుకుంటారని కమిషనర్ షేక్ ఫజులుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న చైర్మన్ పదవికి నూతన అభ్యర్థిని ఎన్నుకునేందుకు రాష్ట ఎన్నికల అధికారి సోమవారం అనుమతినిచ్చిన నేపథ్యంలో ఎన్నికల అధికారిని నియమించవలసిందిగా కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఇటీవల వరకు చైర్మన్‌గా ఉన్న చల్లా అంకులు అనారోగ్య కారణాలతో తన చైర్మన్ పదవికి రాజీనామా చేయటంతో నూతన అభ్యర్థి ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న బాపతు వెంకటరెడ్డి, ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

ఏపీటీఎఫ్ నగర శాఖ అధ్యక్షుని ఎన్నిక

ఒంగోలు: ఏపీటీఎఫ్ నగర శాఖ అధ్యక్షులుగా డి.మధు ఎంపికైనట్లు ఎన్నికల అధికారి బి.శేషారావు ప్రకటించారు. ఎన్నికల కార్యక్రమం మంగళవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ప్రధాన కార్యదర్శిగా యు.సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా టి.బాలసౌరి, యు.రాధాకుమారి, వెంకట ప్రసాద్, కార్యదర్శులుగా ఎం.పవన్‌కుమార్, ఎస్.శ్రీకాంత్, బి.రమాదేవి, డి.రామచంద్రారావుతో పాటు పలువురు జిల్లా కౌన్సిలర్లు, సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

నేడు శ్రీగిరిలో మహా సుదర్శన హోమం



కొండపై వెంకటేశ్వర స్వామి దేవస్థానం

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం ఏడు గంటలకు మహా సుదర్శన హోమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి దివ్య దర్శనం చేసుకోవాలని తెలిపారు.

10న డయల్ యువర్ డిపో మేనేజర్

ఒంగోలు: ప్రయాణికుల సౌకర్యార్థం వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించి ఆర్టీసీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు కోరుతూ ఈనెల 10న డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతుందని, ఆసక్తిగలవారు మొబైల్ 9959225695 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం ఈనెల 19,26, డిసెంబర్ 3, 10 తేదీల్లో ఒంగోలు నుంచి పంచారామాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. 36 మందికి పైగా ఒక బ్యాచ్ ఉంటే ఆ గ్రామం నుంచే బస్సు కేటాయిస్తామని చెప్పారు. ప్రత్యేక టూర్ ప్యాకేజీలకు కూడా బస్సులను నడుపుతామని చెప్పారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: జిల్లాలో ఎంపిక చేసిన ఏడు పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు, జిల్లాలోని సంబంధిత మండల విద్యాశాఖాధికారులు, హెడ్మాస్టర్లను మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఒంగోలు, టంగుటూరు, దర్శి(ఒంగోలు డివిజన్), మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, వై.పాలెం(మార్కాపురం డివిజన్)లో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డివిజన్ కేంద్రాల్లో ఆయా డివిజన్ ఉప విద్యాశాఖ అధికారులు ఇన్‌చార్జి బాధ్యత వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏడు సెషన్స్‌లో మీటింగ్ నిర్వహించడం జరుగుతుందని, కొన్ని సెషన్స్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని తెలిపారు.ఒక్కో కేంద్రానికి ఏయే మండలాలు కేటాయింపు జరిగిందో కాంప్లెక్స్ నిర్వహణ విధి విధానాలు, అజెండాను జిల్లాలోని అందరు ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులకు మెయిల్ చేశామన్నారు. ప్రతి నెల ఈ మీటింగ్‌ల నిర్వహణ ఉంటుందని, అందరూ తప్పక హాజరుకావాలని డీఈఓ ఆదేశించారు.

జీవనశైలి మార్పులతో క్యాన్సర్ ముప్పు



ఒంగోలు: క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రఘునందన్

ఒంగోలు టౌన్: మారిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి, మానసిక ఒత్తిడి వంటి కారణాలు క్యాన్సర్‌కు కారణం అవుతున్నాయని ప్రముఖ డాక్టర్ ఆర్వి రఘునందన్ చెప్పారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్‌సీజీ ఎంఎన్నార్ క్యాన్సర్ సెంటర్ సహకారంతో స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాలలో నేషనల్ క్యాన్సర్ అవేర్నెస్ డే నిర్వహించారు. క్యాన్సర్ గురించి అవగాహన కలిగి ఉంటే దీటుగా ఎదుర్కోవచ్చన్నారు. ఆధునిక వైద్యంలో క్యాన్సర్‌కు అనేక మంచి ఔషధాలు వచ్చాయని, ప్రభుత్వాలు సైతం తమవంతు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. కాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అడుసుమల్లి వెంకటరావు, రీజియన్ చైర్మన్ న్యామతుల్లా భాషా, జోన్ చైర్మన్ చిట్టెంరెడ్డి శ్రీనివాస రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, మంగళగిరి నరసింహారావు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

చీమకుర్తి: జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం చీమకుర్తిలోని అర్బర్ హెల్త్ క్లీనిక్‌లో ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, ఇతర వైద్యసిబ్బందికి క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. ఒంగోలు ఎంఎన్ఆర్ క్యాన్సర్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ వేమా వెంకట్రావు ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ క్లీనిక్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు. క్యాన్సర్ నియంత్రణకు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు.



చీమకుర్తి: క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్, వైద్యసిబ్బంది

వల్లూరమ్మ ఆలయంలో బాలినేని పూజలు



వల్లూరమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న బాలినేని శ్రీనివాసరెడ్డి, మారం వెంకారెడ్డి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, అర్చకులు నాగేశ్వరరావు, ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలినేనికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. కుంకుమార్చన, గోత్ర నామార్చన పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అనంతరం అద్దంకి నియోజకవర్గ పరిశీలకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి దంపతులు వల్లూరమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మొక్కులు కార్యక్రమంలో బాలినేనితోపాటు అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బాచిన గరటయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పోతుల సురేష్, కుందం హనుమారెడ్డి, అద్దంకి, సంతనూతలపాడు, దర్శి నియోజకవర్గాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి



సభలో యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి

ఒంగోలు రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు ఇప్పటి నుంచే రానున్న ఎన్నికలకు చిత్తశుద్ధితో సమాయత్తం కావాలని యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బాలినేని స్వగృహంలో వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి ఒంగోలు రూరల్ మండల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన వైనాట్ 175 సీట్లు పొందేందుకు ప్రతి ఒక్కరు క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ చుండూరి రవి, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ సోమశేఖర్, పొగాకు ఉత్పత్తి దారుల సమాఖ్య చైర్మన్ వాకా బసివిరెడ్డి ప్రసంగించారు.

వైద్యారోగ్య శాఖ మినిస్టీరియల్ అధ్యక్షుడిగా నారపుశెట్టి



రామ్మోహన్



కిరణ్ కుమార్

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్య మినిస్టీరియల్ అధ్యక్షుడిగా నారపుశెట్టి రామ్మోహన్, కార్యదర్శిగా విప్పర్ల కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా కూచిపూడి శరత్ బాబు, అసోసియేట్ ప్రసిడెంట్‌గా వై.ప్రభుదాస్, ఉపాధ్యక్షులుగా సత్యం, ఎమ్.సుకుమార్, జీ.పేరిశెట్టి, కోశాధికారిగా బాబురావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస యాదవ్, మహిళా కార్యదర్శిగా శ్రీదేవి ఎన్నికయ్యారు. మరో తొమ్మిది మందిని ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు.

11న భారత రాజ్యాంగ విశిష్టతపై సెమినార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకరరావు

ఒంగోలు: ఈనెల 11న స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో భారత రాజ్యాంగ విశిష్టతపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లిఖార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావులు ప్రకటించారు. మంగళవారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో సెమినార్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకరరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కనుమాల రాఘవులు, సింగరెట్టి శివరామకృష్ణ, పిల్లి రమేష్‌లతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ ఆమోద దినోత్సవం నవంబరు 26న పురస్కరించుకుని ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ఆలోచన రేకెత్తించేందుకు ఈ సెమినార్ ఈనెల 11న ఉదయం 10గంటలకు సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా పూర్వ ప్రకాశం జిల్లా కలెక్టర్ దాసరి శ్రీనివాసులు హాజరవుతారన్నారు. మిడసల మల్లిఖార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు



ఊపిరి పోసుకున్న మిరప మొక్కలు

ఒంగోలు సెంట్రల్: వాయుగుండంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. సోమవారం 38 మండలాలకు గాను 18 మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లాలో నాలుగు రోజులుగా సరాసరి 38.5 మి.మీల వర్షపాతం నమోదు కాగా సోమవారం 170.8 మి.మీలు నమోదైంది. పీసీపల్లిలో అత్యధికంగా 36.4 మి.మి కురిసింది. జరుగుమల్లిలో 23.6, పొన్నలూరులో 16.4, టంగుటూరులో 15.4, సింగరాయకొండలో 12, కొత్తపట్నంలో 11.2, కొండపిలో 10.2, ఒంగోలులో 8.8, ఎస్ఎన్‌పాడులో 8.6, మద్దిపాడులో 4.8, ముండ్లమూరులో 4.8, ఎన్‌జీపాడులో 3.4, పామూరులో 3.2, మర్రిపూడిలో 3, చీమకుర్తిలో 2.6, దర్శిలో 1.8, కురిచేడులో 1 మి.మీ, మార్కాపురంలో 1 మి.మీగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఝాన్సీదుర్గ



ఝాన్సీదుర్గ

ఒంగోలు మెట్రో: ఐ.ఎస్.ఓ. గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ కళావేదిక రాష్ట్ర కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన కవయిత్రి వల్లభుని ఝాన్సీదుర్గ నియమితులయ్యారు. అంతర్జాతీయ చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ ఆదేశాల మేరకు జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఉత్తర్వులు జారీచేశారు. ప్రముఖ కవయిత్రి, రేడియో గాయని, సీనియర్ రచయిత్రి విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు వల్లభుని ఝాన్సీదుర్గ ప్రస్తుతం కళావేదిక ప్రకాశం జిల్లా అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. పలు ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితురాలిగా పనిచేశారు. రేడియోలో అనేక సంవత్సరాలు పాటలు పాడి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. జై ఆంధ్ర ఉద్యమకాలంలో ముప్పవరపు వెంకయ్యనాయుడు వంటి ప్రముఖులున్న వేదికపై చిన్న వయసులోనే చైతన్య గీతాలు ఆలపించారు. శ్రీశ్రీ కళావేదిక ఒంగోలు జిల్లా నాయకులు, అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు ఝాన్సీదుర్గ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్వామిత్వ సర్వేకు సహకరించాలి



పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలో పాల్గొన్న డీపీఓ నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న నివాస ప్రాంతాల స్వామిత్వ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడి అన్నారు. మంగళవారం కలెక్టర్ పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయా పంచాయతీల పరిధిలోని గ్రామ కంఠంలో గల ప్రభుత్వానికి చెందిన ఆస్తులు, వ్యక్తిగత ఆస్తులు, ఇల్లు, ఖాళీ స్థలాల కొలతల నిమిత్తం గ్రామ పంచాయతీ జారీ చేసే సమయంలో యజమానులు అందుబాటులో ఉండి ఆస్తి ధ్రువీకరణపత్రాలు, నకళ్ళు సర్వే బృందానికి అందజేసి సహకరించాలని కోరారు.

ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: గత కొద్ది రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్న కారణంగా నగర ప్రజలు ఇబ్బందుకు గురికాకుండా కాలువ పూడికతీత పనులను చేపట్టాలని, రోడ్ల మీద మురుగు నీరు నిలవ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమీషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని దత్తాత్రేయ కాలనీ, పోతురాజు పాలెంలో పర్యటించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మారుతీనగర్ సచివాలయం తనిఖీ

నగరంలోని మారుతీ నగర్ సచివాలయంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఇప్పటి వరకు 48 శాతం ఇంటి పన్నులు చెల్లించినట్లు అడ్మిన్ తెలిపారు. మిగిలిని 52 శాతం పన్నులను కూడా నిర్దేశించిన సమయం లోపలే వసూలు చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు బ్యారన్ పరిశీలన



బ్యారన్‌ను పరిశీలిస్తున్న బోర్డు అధ్యక్షుడు యశ్వంత్ కుమార్, ఆర్ఎం లక్ష్మణ్‌రావు, సిబ్బంది

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మంగమూరులో కరెంటుతో పనిచేసే పొగాకు బ్యారన్‌ను పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ పరిశీలించారు. బోర్డు ఆర్ఎం లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం పొగాకు బోర్డు సూపర్‌వైజర్ రవికుమార్, ఐటీసీ మేనేజర్ శివకుమార్ కరెంటు బ్యారన్‌ను పరిశీలించారు. మంగమూరు పొగాకు రైతు వడ్లెల ప్రసాద్ ఆధ్వర్యంలో కరెంటుతో పనిచేసే బ్యారన్‌ను నిర్మించారు. కట్టెల ఖర్చు తగ్గించుకునేందుకు కరెంటు వినియోగం ద్వారా ఖర్చు ఆదాయం చేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతు నిర్మించిన బ్యారన్ పనితీరును బోర్డు చైర్మన్, అధికారులు పరిశీలించి రైతును అభినందించారు. కట్టెల ఖర్చుకు, కరెంటు ఖర్చుకు తేడా ఎంత ఉంటుందో బ్యారన్ వినియోగంలోకి వచ్చిన తర్వాత గాని అంచనా వేయలేయమని బోర్డు ఆర్ఎం లక్ష్మణ్‌రావు అభిప్రాయపడ్డారు.

రైతు భరోసాకు 10,206 మంది అర్హులు

పుల్లలచెరువు: మండలంలోని 19 సచివాలయాల పరిధిలో 10, 206 మంది రైతులు రైతు భరోసాకు అర్హులుగా నిర్ధారించినట్లు వ్యవసాయాధికారి నిర్మిలాదేవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన రైతు భరోసాకు మండలంలో 10,206 మంది అర్హత సాధించగా ఒక్కో రైతుకు రూ.2 వేలు ఖాతాల్లో జమ చేయనున్నారని చెప్పారు.

అర్హులందరికీ రైతు భరోసా

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని 7460 మంది రైతులకు 2023-2024 సంవత్సరానికి గాను రెండో విడత రైతుభరోసా నిధులు మంజూరైనట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరు రైతుభరోసా కేంద్రంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా రెండో విడత నిధులు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. నగదును రబీలో సాగు ఖర్చులకు ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ కె. యుగకీర్తి రైతులకు సూచించారు. నాగరాజునాయక్, వెంకటరావు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

అర్ధవీడు (కంభం): మిరప పంట రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని స్థానిక ఉద్యానవనశాఖాధికారి శ్వేత అన్నారు. మండలంలోని కాకర్లలో మిరప పంట రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మిరప పంటలో రసం పీల్చే పురుగులను నిర్మూలించాలన్నారు. నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు.

టెక్నాలజీ ఉపయోగించుకోవాలి

ఒంగోలు సెంట్రల్: సాంకేతికత పరిజ్ఞానాన్ని విద్యార్థులు తమ జ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసుకోవటానికి మాత్రమే ఉపయోగించాలని వక్తలు అన్నారు. సాయి బాబ సెంట్రల్ స్కూల్‌లో మంగళవారం 'చదువులపై సాంఘిక ప్రసారాల మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జీవీ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉంటూ శారీరిక క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అకడమిక్ డైరెక్టర్ శృతి సాయినాథుని మాట్లాడుతూ ... విద్యార్థుల జీవితంలో టెక్నాలజీని క్రమశిక్షణ లోపించకుండా ఉపయోగించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.



లఘునాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

11న విశ్వరూప మహాసభ



కరపత్రాలతో వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు

ఒంగోలు మెట్రో: ఈనెల 11న మందకృష్ణ మాదిగ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తలపెట్టిన విశ్వరూప మహాసభ కరపత్రాలను స్థానిక అంబేడ్కర్ భవనం దగ్గర వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి కోర్ కమిటీ కో కన్వీనర్ అందే రాంబాబు కోర్ కమిటీ సభ్యులు జాతీయ ప్రధాన కార్యదర్శి ఆనాల సురేష్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్న బాలాజీ చిప్పలపల్లి సురేష్, నారాయణ పూరి మెట్ల అనిల్, హాస్టల్ నారాయణ, సురేష్ సుబ్బారావు, మహేష్ బాబు, జిలానీ బాష ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తోరటి ఆనంద మాదిగ ఎంఎస్పీ అద్దంకి ఇన్‌చార్జ్ ధనరాజ్ పల్లి ఆంజనేయ మాదిగ, ఒంగోలు టౌన్ ఇన్చార్జి తిరువూరు బాబు మాదిగ అభిషేకం మాదిగ పాల్గొన్నారు.

వ్యాసరచన వక్తృత్వ పోటీలు విజయవంతం



విద్యార్థులను పరిశీలిస్తున్న ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, శ్రీనివాసరావు

మద్దిపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు విద్యావనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పోటీలు నిర్వహించారు. ఖాదీ-స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యమైన చిహ్నం అనే అంశం పై ఉపన్యాసం, ఖాదీ-గాంధీజీ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈపరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం. శ్రీనివాసరావు పరీక్షలు నిర్వహించి పర్యవేక్షించారు.

ఇద్దరి కోసమే మోదీ పాలన



మాట్లాడుతున్న నేత ఉమామహేశ్వరరావు

చీమకుర్తి: రైతులు, కూలీలను కరువు నుంచి ఆదుకోవాలని సీపీఎం రాష్ట నాయకులు ఉమామహేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఎం చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం సంతనూతలపాడుకు చేరుకున్న సందర్భంగా సంతనూతలపాడులో ఏర్పాటు చేసిన సభకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి సీపీఎం నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మోదీ అదానీ, అంబానీలకు తప్ప ఎవరికీ ఉపయోగపడటం లేదని దుయ్యబట్టారు. ఎస్‌కే మాబు, వి.కృష్ణయ్య, భాస్కరయ్య, జాలా అంజయ్య, పూనాటి ఆంజనేయులు, కంకణాల ఆంజనేయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బంతి మొక్కల పంపిణీ



రైతులకు బంతి మొక్కలు అందిస్తున్న ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి కోవి రామక్రిష్ణ

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు -2 పొగాకు బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం పొగాకు సాగు చేయు రైతులకు ఐదు వేలు బంతి మొక్కలు పంపిణీ చేశారు. ఒంగోలు-2 వేలం నిర్వాహణాధికారి కోవి రామక్రిష్ణ మాట్లాడుతూ పొగాకు పంటలో ట్రాప్ క్రాప్ కోసం ఈ సంవత్సరం 50వేల బంతి మొక్కలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. కరవది, ఒంగోలు, త్రోవగుంట, మద్దిరాల పాడు, చెకుపపాడు, ఇనమన మెళ్లూరు రైతులకు బంతి మొక్కలను అందించారు. ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై సదస్సు

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వం యువత కొరకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వాటిని అవగాహనతో ఉపయోగించుకోవాలని జిల్లా ఉపాధి మరియు శిక్షణ అధికారి భరద్వాజ అన్నారు. సెట్ప్ ఆధ్వర్యంలో ఏకేవీకే డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా స్కిల్ డెవలప్ మెంట్‌అధికారి ఆర్. లోకనాథం మాట్లాడుతూ ... ప్రభుత్వం కల్పిస్తున్న పలు ఉచిత శిక్షణలు ఉపయోగించుకుని జాబ్ మేళాలలో పాల్గొని వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. సెట్ప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, రిమ్స్ సైకాలజిస్ట్ ఎస్. ఏడుకొండలు పాల్గొన్నారు.